ప్రజల మాట ప్రగతి బాట

బాన్సువాడ నియోజకవర్గం

# పోచారానికి మద్దతుగా జోరందుకున్న ప్రచారం

## మ్యానిఫెస్టోను వివరిస్తూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నస్రుల్లాబాద్ మండలం హాజీపూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


దేశాయిపేట్‌లో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ రూరల్/బాన్సువాడ/నస్రుల్లాబాద్ , నవంబర్ 1 : బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బుధవారం బీఆర్ఎస్ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహించారు. బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్, సోమేశ్వర్, ఇబ్రహీంపేట్, బోర్లం, కొల్లూరు తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన పోచారం శ్రీనివాసరెడ్డికి భారీ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, వెంకటరమణ, భూనేకర్ ప్రకాశ్, ప్రశాంత్‌కుమార్, మల్లేశ్, భూషణంగౌడ్, బాబురావు, సాయిలుయాదవ్, శ్రీనివాసరెడ్డి, దేవేందర్‌రెడ్డి, సాయిలు, సాయాగౌడ్, పండరి, రమేశ్, రాజేశ్వర్ గౌడ్, మన్నెచిన్నసాయిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. బీర్కూర్‌లోని పలు కాలనీల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నర్రసాయిలు, పోగు నారాయణ, అబ్దుల్ అహ్మద్, దుంపల రాజు, బస్వరాజు, గౌస్, నవీన్ తదితరులు ఉన్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని హాజీపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు జోరుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్, ఎంపీపీ పాల్త్య విఠల్, జడ్పీటీసీ సభ్యురాలు జన్నూబాయి, సర్పంచ్ అంజయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రాము, నాయకులు ప్రతాప్ సింగ్, విఠల్, మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బీర్కూర్ మండలంలో..

## సర్వీస్ రూల్స్ త్వరలో సాధిస్తాం

### మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 1: ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను త్వరలో సాధిస్తామని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డికి ఆయన మంగళవారం రాత్రి రావడంతో పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ సాధిస్తామని తెలిపారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్ రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, కుషాల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణమూర్తి, శ్రీనివాస్, పీఆర్టీయూ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎం ధ్వంసం

గాంధారి, నవంబర్ 1: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న ఇండియా వన్ ఏటీఎంను గుర్తు తెలియని దుండగులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. రాళ్లతో పగులగొట్టారు. ఘటనా స్థలాన్ని సదాశివనగర్ సీఐ రామన్, గాంధారి ఏఎస్సై గణేశ్ బుధవారం పరిశీలించారు. ఎలాంటి డబ్బు చోరీకి గురి కాలేదని గుర్తించారు. ఇండియా ఏటీఎం ఉద్యోగి స్వామీగౌడ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని గాంధారి పోలీసులు తెలిపారు.

## నేడు బాన్సువాడలో మెగా వైద్య శిబిరం

బాన్సువాడ, నవంబర్ 1 : బాన్సువాడలోని డాక్టర్ అంజిరెడ్డి కాంప్లెక్స్‌లో మా దవాఖాన హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మా రీసెర్చ్ ఫౌండేషన్ సమన్వయకర్త లక్ష్మీకాంతం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిపుణులైన ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. రెండేండ్లలోపు చిన్నారులకు మూగ, వినికిడి సమస్య ఉన్న వారికి ఉచితంగా వినికిడి స్క్రీనింగ్ చేయబడుతుందని పేర్కొన్నా రు. వైద్య శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్ధం

### • ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

సదాశివనగర్, నవంబర్ 1: ఎల్లారెడ్డి పోలీస్ డివిజన్‌లోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎన్నికలను ప్రశాతంగా నిర్వహించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. డివిజన్ పరిధిలోని రెండు చెక్ పోస్టుల వద్ద ఇప్పటి వరకు రూ.19,87,250 డబ్బులను సీజ్ చేశామని చెప్పారు. సదాశివనగర్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. నాగిరెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెదక్ జిల్లా సరిహద్దులో ఉన్న పోచారం గ్రామంలో, నిజామాబాద్ జిల్లా సరిహద్దులో ఉన్న సదాశివనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దగ్గి గ్రామ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై చెక్ పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి రోజూ వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు తెలిపారు. ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 15 బెల్టు షాపులను సీజ్ చేసి 403 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటివరకు లైసెన్సు కలిగిన రెండు పర్సనల్, మూడు ఎస్‌బీఐకి చెందిన మొత్తం ఐదు తుపాకులను సీజ్ చేశామని చెప్పారు. పలు కేసులు ఉన్న 450 మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా రెండు పార్టీలకు చెందిన అభ్యర్థులు నాలుగు వాహనాలకు అనుమతి తీసుకున్నారని చెప్పారు. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే వెంటనే స్థానిక పోలీసులు లేదా 100 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


మహ్మద్‌నగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో రాములు


గాంధారి మండలం మాతుసంగెంలో ఏవో నరేశ్..

నిజాంసాగర్/గాంధారి/పెద్దకొడప్‌గల్, నవంబర్ 1: నిజాంసాగర్ మండలంలోని గున్కుల్ సొసైటీ ఆధ్వర్యంలో మహ్మద్‌నగర్, గున్కుల్, బుర్గుల్, తున్కిపల్లి, నర్వ గ్రామాల్లో సొసైటీ సీఈవో రాములు బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనవెంట సిబ్బంది భాస్కర్, సాయి తదితరులు ఉన్నారు.

అచ్చంపేట సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఈవో స్వర్ణలత సందర్శించారు. రైతులు తూకం కోసం తీసుకువచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. తూకం వేసిన ధాన్యానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంటనే సమర్పించాలని రైతులకు సూచించారు.

గాంధారితో పాటు బ్రాహ్మణ్‌పల్లి, మాతు సంగెం, గుర్జాల్, పేట్ సంగెం, పొతంగల్ కుర్దు గ్రామాల్లో గాంధారి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయాధికారి నరేశ్ ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి, సిబ్బంది గాండ్ల సాయిలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏవో నదీముద్దీన్ పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయనవెంట సొసైటీ సిబ్బంది రమేశ్, రైతులు ఉన్నారు.

## ఎడ్యుకేషన్ సర్వేపై శిక్షణ

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 1: స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటేశం నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాల ప్రధానోపాధ్యాయులకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు నవంబర్ 3వ తేదీన నిర్వహించే ఎస్ఈఏఎస్, 3,6,9వ తరగతి విద్యార్థులకు ఎడ్యుకేషన్ సర్వే నిర్వహించడంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, మండల నోడల్ అధికారి రాజులు, నాగిరెడ్డిపేట్ కో ఆర్డినేటర్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్లాంకెట్ల వితరణ

పిట్లం, నవంబర్ 1: మండలంలోని చిన్నకొడప్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అటెండర్ విఠల్‌కు చలికాలం దృష్ట్యా పిట్లం రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బ్లాంకెట్లను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయుడు కిష్టయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలించిన ఎమ్మెల్యే


బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే షిండే

పిట్లం, నవంబర్ 1: మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం లింగంపేట మండలానికి చెందిన రంజిత్ బైక్ పైనుంచి పడడంతో గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే షిండే గమనించి బాధితుడిని అంబులెన్స్‌లో పిట్లం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం రంజిత్‌ను బాన్సువాడకు తరలించినట్లు పిట్లం వైద్యులు తెలిపారు.

## యాసంగి పంటల సాగుపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి

గాంధారి, నవంబర్ 1: మండలంలోని పొతంగల్ కలాన్‌లోని రైతువేదిక భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో యాసంగి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కామారెడ్డి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి యాసంగిలో రైతులు సాగు చేసే మక్కజొన్న, జొన్న, శనగ, నువ్వు, పొద్దుతిరుగుడు, కుసుమ, గోధమ పంటలపై అవగాహన కల్పించారు. యాసంగిలో పంటలకు ఎండు తెగులు సోకకుండా ముందస్తుగా ట్రైకోడర్మా విరిడే 5 – 10 గ్రాముల మందుతో విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేశ్, ఏఈవో షోయబ్ అహ్మద్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.